# హోమగుండం

ప్రభూత సత్యం కతరో హ్యంగనానాం
దోషోస్తి యో నాచరితో మనుష్యైః

(స్త్రీల విషయంలో మనుష్యులు ఆచరించని దోషం ఏదయినా వుందా? నిజం చెప్పండి.)
—వరాహ మిహిరుడు

మొదటి భార్య చితాగ్నినుంచే వీడు రెండోపెళ్ళి హోమానికి నిప్పు తీసుకొచ్చాడన్న నిందను హనుమంతరావు నిబ్బరంగా భరించాడు.

అమాయకంగా "ఏదో నాయినా యింతకూ గుణం ప్రధానం. యింత గూట్లో దీపం పెడుతుంది గదా! పిల్లా-మేకా కలిగి పది కాలాల పాటు చల్లగావుంటే" అన్న ముసలమ్మ లాంటి వాళ్ళ ఓదార్పు అతను నిమ్మదిగా భరించాడు.

"గంతకు తగ్గ బొంత" అన్న కటూక్తిని గూడా హనుమంతరావు ఓర్చుకున్నాడు.

చాటుగా లోకులు అన్న మాటలకు విలువేమిటి? నేటుగా—హనుమంతరావు, 'సంఘ సంస్కరణంలో ఒక్కడుగు—ఒక్క అడుగేమిటి వంద అడుగులు ముందుకేశాడు' అన్న మెచ్చుకోలు లాంటివాన్నీ మింగాడు.

"ఒరేయ్-నీవు ఎంత ఇదైతే మాత్రం ఈ చెక్కపేడ్రటా-నీకు దొరికిందీ?" అన్న ఆంతరంగిక శత్రువులను గూడా అతడు క్షమించాడు.

చిన్నమెత్తయినా చలించకుండా స్థితప్రజ్ఞుడిలాగు వ్యవహరించాడు. అతడు ఈ మాటలన్నీ ప్రజల కంటే క్రూరంగా ముందే అనుకుని ఆ బాధేమిటో ముందే పడ్డాడు.



భార్య చనిపోయిన నెల్రోజులలోగానే-శరణాలయం పంచను వున్న నరసమ్మను-పచ్చి బాలెంతరాలును— అగ్నిసాక్షిగా పెళ్ళి చేసుకున్నాడు.

మామూలుగా లోకంతోపాటు అయితే-తన కింకా పెద్దపురుడు వెళ్ళలేదు. అలాంటి దశలో ఇంకా చెవుల్లో దూదిపెట్టుకునే స్థితిలో—— మెళ్ళో పుస్తె కట్టించుకుంది నరసమ్మ. తన బిడ్డ సంధిగొట్టి పోయిన పంథొమ్మిదో రోజున ఆమె తిరిగి వో యింటిదయింది.

తనకోసం ఒకడంటూ వచ్చి నాకు కావాలి, నేను పెళ్ళాడతాను అని అంటారనీ, అన్నా మాట నిలుపుకుంటారనీ ఆమె కల్లోగూడా అనుకోలేదు. ఈ శరణాలయంలోనే యిల్లాగ పడివుండో—అక్కడే యేదన్నా చాకిరీచేసో—జీవితం వెళ్ళదీసుకోవాలి కాబోలు భగవంతుడా అని ఆమె వాపోయింది. రూపాయినోటులాగు చేతులు మారిమారి శరణాలయంలో పడ్డానన్న సంగతి ఆమె ఏమాత్రం మరచిపోలేదు.

తానా రూపసీ కాదు, అందవికారీ కాదు. వెనకటి సంగతులూ—గౌరవమూ చూద్దామా, అయ్యోరాత! అద్ధాన్నంగా వున్నై. ఏంచూసి, ఎవరు చేసుకుంటారు?

తనను చూట్టానికి హనుమంతరావు వచ్చినప్పుడు ఇవన్నీ తెలిసే వచ్చాడనుకుంది. రెండోసారి ఖాయం చేసుకోడానికి వచ్చినప్పుడు—అంతా చెప్పించింది. ఇది వినిగూడా హనుమంతరావు ఒప్పుకున్నాడంటే—హనుమంతరావులో ఆమెకు దైవాంశ కొట్టవచ్చినట్లు కన్పడింది. ఆమె హృదయంతో అతనికి కర్పూరహారతి ఇచ్చేస్తుంది. తన జీవితాన్ని ఎవడో ఒకడు, అతని నీడను చేరి అతన్ని సుఖపెట్టి—తాను యింత సుఖపడదామన్న ఆమె జీవిత వాంఛ నేటికి అత్యుత్తమరీతిని ఫలించింది.

వివాహవేదికమీద ఎన్నోబరువులతో, సిగ్గుతో నరసమ్మ తలవొంచు కూర్చుంది. పురోహితుడు చెప్పినవన్నీ చేస్తోంది.

ఆ క్షణాన ఆమెకు తన మొదటి పెళ్ళి, నెత్తిన ఉభయులూ జీలకర్రా బెల్లమూ పెట్టుకోడం, పానుపు, దండాడించడం, అప్పగింతలు గుర్తుకొచ్చై. తన కార్యంనాడు ఆ భర్త తన మీదగా చెయ్యివేసి పళ్ళెం పట్టుకోడం, బ్రాహ్మలు వేదం చెబుతూంటే-తనకేసి అన్నా చూడకుండా వంగటం గుర్తుకొచ్చింది. తోలినకొద్దీ మూగి, దోమలు సంగీతంపాడి కుట్టినట్లు కుడుతూన్నై ఆ స్మృతులు.

ఆర్యసమాజం పురోహితులేమో-పెందరాళే తెమిలింది పెళ్ళి.

హనుమంతరావు స్నేహితులకు హనుమంతరావుతో కలిసి నమస్కారంచేసి లోపలికి వెళ్ళింది నరసమ్మ. నిస్త్రాణగా వుందేమో-వెళ్ళి వో చాపమీద వొరిగింది. అసాధ్యం అని అనుకుని ఇంచుమించు నిరాశ చేసుకుంటున్నదిసాధ్యపడితే-ఎంతటివాళ్ళకైనా నిజమా కలా అనిపిస్తుంది. నరసమ్మ తెల్లబోయి చూస్తోంది. హనుమంతరావు రావటం, తనను చూట్టం, వాళ్ళ శరణాలయం వాళ్ళతో మాట్లాడ్డం, తానుయీపెళ్ళి తీరా ఫలసాయానికి వచ్చి ఎక్కడ చెడిపోతుందోనని ఓరాత్రంతా గుంజాట్ల పడటం, పాప సంధిగొట్టి పోవటం, సంబంధం ఖాయం కావటం, పెళ్ళి కావటం అన్నీ క్షణంలో సినీమాలో జరిగినట్లు జరిగినై.

తన బతుకు గూడా సినిమా లాగానే వుంది.ఇంతకూ తనకు పద్దెనిమిదో ఏడు. తన బతుకు అప్పుడే ఎంతో ఇదయ్యింది. వారు బతికే వుండ గూడదూ? ఎక్కడో అక్కడ ఏదన్నాచేసి నూకలు కాచుకునైనా మర్యాదగా బతికేవాళ్ళు. పాపం, ఆయన మరీ అన్యాయం. వొక్కనాడైనా ఆయన అనుకుంది కానేలేదు. తాను కాపరానికి వొచ్చిన కొత్తలో



వోరాత్రి యిద్దరూ నవ్వుతూ తుళ్ళుతూ కబుర్లు చెప్పుకుంటూ గడిపారు తెల్లారగానే—అత్తా, ఆడబిడ్డా "ఎందుకు రాత్రంతా అల్లా పగలబడుతూన్నారూ? మామీద ఏం చెప్పుకుంటున్నారు.?" అని నిగ్గదీశారు. 'ఏం పగలే మా అమ్మా' అని తన్ను కాల్చుకు తినలా? ఊఁ ఇప్పుడవన్నీ తల్చుకోవడం ఎందుకు?

తనకు పకోడీలూ, మల్లెపూలూ యిష్టం అని తెలిసి, ఆయన తెచ్చిన్నాటిరాత్రి ఎన్ని మాటలన్నారు? తలచుకు తలుచుకు గుండె చెరువు కావటం తప్ప-మరేముంది. ఆయనకు జబ్బు ఎప్పుడు ప్రారంభం అయిందో —అప్పుడే తన కళ చెడింది.

పుట్టింటి వాళ్ళయినా వుంటే 'గోప్యం'గా బతికి ఉండేదేమో? ఆ అదృష్టానికి ఏ నోం నోచుకోవాలో-ప్చ్!

భర్తపోయి- తను తలచెడి ఓమూల చాప చుట్టలాగు పడి ఏడుస్తుంటే-ఆ మరిది-వాడే-ఛండాలుడు-తనూ వారూ పడుకుంటే-గదిగుమ్మం దగ్గిర చెవులు దోరబెట్టుకుని ఉండేవాడు— తన్ను నెమ్మదిగా లాలించి దగ్గరకు తీశాడు. వాడి మొహం మండా తనకు పొద్దున్నే డోకులు. తనే లోపల్లోపల కుమిలి ఏడుస్తోంది. ఇదేం ఖర్మమా భగవంతుడా? అని. ఈ అత్తా, ఆడబిడ్డలు సన్నగా రామరావణాయుద్ధం చేసి కోసి పాతరేస్తున్నారు. ఈ ముంగిస ముశానమ్మ-తన్నేమన్నా వెనకేసుకొచ్చాడా? ఎందుకు తాను తిట్టటం—తన తలరాత అల్లావుంటే ఎవరేం చేస్తారు. వారే బతికి ఉంటే-అప్పుడు తనకు చేతులనిండా గాజులు తొడిగి సీమంతం చేసేవాట. ఆయన పోబట్టిగదూ ఇంట్లోంచి వెళ్ళగొట్టారు! తరువాత తను ఎన్ని బాధలు పడిందీ? ఎందరవమానించలేదు? తనగది కిటికీ అవతల పులిస్త్రీకుల్లాగా ఎంతమంద ప్రియులు పడివుండలేదు? అన్నీ హాలాహలంలాగ భరించి బతికిందిగాని....! ఇంతలో హనుమంతరావు వొచ్చాడు.

అల్లాగే పడుకుందా మనుకుంది నరసమ్మ. తనకు ఏం చనువుందీ పడుకోటానికీ, చిన్నగా నవ్వటానికీ? లేచింది. 'పడుకో పడుకో' అంటూ హనుమంతరావు దగ్గిరకి వచ్చి కూచున్నాడు. 'భోజనానికి రావూ?' అన్నాడు.

మనిషి పిలుపులో లాలనలేదు, కాఠిన్యమూ లేదు.

'మీరు కానీండి, వస్తా'నంది.

'పొద్దు పోతుందేమో—ఉండలేవు గూడాను!' అన్నాడు మళ్ళీ హనుమంతరావు.

'కాస్సేపుండి తింటానండి!' తను.

హనుమంతరావు లేచి భోజనాల దగ్గిరికి వెళ్ళాడు. మర్నాడు పెద్దల దగ్గిర శెలవు తీసుకుని మద్రాసు వొచ్చేశారు. చెన్నపట్నం తను ఎన్నేళ్ళనుంచో చూద్దామనుకుంటోంది.

రైలులోనే హనుమంతరావు గమత్తుగా మారాడు. తను వెనక్కి పరిగెత్తుతున్నట్టున్న చెట్లని చూస్తున్నా. రైలు స్టేషను దాటాక—ఎర్ర ఎర్రగా చీకట్లో నిలబడ్డ దీపాలను చూస్తున్నా. పెట్టెలో జనాన్ని చూస్తున్నా మొహం ఏమిటోగా పెట్టుకుంటాడు. ఏమాలోచించుకుంటు న్నాడో ఏమిటో అనుకుంది తను.

వారం రోజులు బాగా గడిచై. తాను కాచిన కాఫీ అమృతంలా గుందన్నాడు....నిద్దర లేచేప్పటికి సిగరెట్టూ అగ్గిపెట్టె అందించడం. పళ్ళు తోముకోడానికి పళ్ళపొడీ, నీళ్ళ చెంబూ, టంగ్క్లీనరూ అమ ర్చడం, మొహం కడుక్కోగానే కాఫీ యివ్వడం, అవన్నీ ఆయనకు నచ్చి నట్లే ఉన్నై. ఏదో మథనపడుతూన్నట్లుంటాడు. అడుగుదామా ఎక్కువ మాట్లాడడు, శిల.



పది పదిహేనురోజులకు, హనుమంతరావు కొడుకును మేన మామ తీసుకొచ్చి దిగడ్చాడు. వీధి తలుపుగొట్టి, పిల్లణ్ణి వాకిట్లో దిగడ్చి వెళ్ళాడు ఆయన, వాడి చొక్కా గుడ్డలమూట గూడా అక్కడే వొదిలి- వారు వచ్చేదాకా వుండండి అని తను అన్నమాట వినిపించుకోకుండా గూడా ఘుమఘుమలాడుతూ వెళ్ళిపోయాడు. నరసమ్మ చిన్నబుచ్చుకుంది. పిల్లాడు ఏడుస్తూ నించున్నాడు. 'దా! నాన్నా! దా!' అంది. వాడు దగ్గిరికి రాలేదు: ఏడుస్తూనే నుంచున్నాడు. సముదాయించబోయింది. తాయిలం పెడతానంది. రానన్నాడు. ఎత్తుకోబోయింది 'నేను రాను పో!' అని వాడు ఏడ్చాడు. వాళ్ళ అమ్మ వుంటే-ఆవిడ అల్లా ఏడవనిస్తుందా? ఇంతలోకే హనుమంతరావు వచ్చాడు. తండ్రిని చూస్తూనే ఇంకా ఎక్కిఎక్కి ఏడ్చి తండ్రిని వాటేసుకున్నాడు.

'దా! నాన్నా!' అని వాణ్ణి మళ్ళీ పిల్చింది.

'వెళ్ళు నాన్నా, పిన్ని' అన్నాడు హనుమంతరావు.

'నేను పోను!' అన్నాడు వాడు.

"పిన్ని నాన్నా—పిన్ని—వెళ్ళు"

"పిన్ని కాదు—బూచి!' అని వాడు మళ్ళీ ఏడ్చాడు.

నరసమ్మకు నవ్వాలో యేడవాలో తెలిసిందికాదు. నెమ్మదిగా వాడంతట వాడే బెరుకు బెరుకుగా వచ్చాడు. నేర్పుగా ఆమె మాలిమి చేసుకుంది.

"నీ పేరేమిటి నాన్నా!" అంది.

'కిష్టుడు'

—ఎంత ముద్దయిన పేరు.

వాడికి తలదువ్వింది, నీళ్ళు పోసింది, యిస్త్రీ చొక్కా, లాగూ, తొడిగింది. మళ్ళీ చెంపలు దువ్వి, చుక్కబొట్టు పెట్టింది. ముద్దొస్తున్నాడు.

పదికాలాలపాటు భగవంతుడు వాణ్ణి రక్షించాలి అని పరాత్పరుణ్ణి ఉద్దేశించి అనుకుంది.

'నేను పిన్నిని కాదు, నాన్నా' అంది.

'పిన్నే'

ముద్దెట్టుకుంది.

'కాఫీ కాచి యివ్వనా'

'ఊ'

కాఫీ కాచి నెమ్మదిగా ఊది యిచ్చింది. తాగాడు.

"నాన్నా నేను బూచినా!' అని లాలనగా అడిగింది.

కిష్టుడు బిక్కమొహం వేశాడు. మా అమ్మే, మానాన్నే! నేచచ్చిపోనూ, భయంలేదులే అమ్మా! అని వీపుదువ్వి ఎత్తుకుంది. 'మామయ్యే అల్లా అన్నాడు' అని మూలకారణం చెప్పేశాడు. పసివాళ్ళు ఏదీ దాచుకోలేరు.

రెండు నెలలు గడిచినవి. హనుమంతరావులో మార్పు గట్టిగా వొచ్చేసింది. ఏమిటో అతను ఎప్పుడూ పరధ్యాన్నంగా వుంటాడు. బైట ఎలావుంటాడో, ఎలా నిర్వహిస్తాడోగానీ—యింటి కొస్తూనే అదోలా అయిపోతాడు.

హనుమంతరావు ఇంటికి వొస్తున్నాడు. బడి వొదిలిపెట్టారేమో—గణగణా ఎగిరి గంతులేస్తూ పిల్లలు బైటికి వొస్తున్నారు. హనుమంతరావు నిదానించి మరీ చూశాడు. బరువుగా చూసి "దిగుళ్ళు వొంట పట్ట



నంతకాలం ఇలా సుఖమే" అనుకున్నాడు. పిల్లల్ని చూస్తూనే—వెనక్కి తిరిగి గూడా చూస్తూనే—ఈ విషయమే ఆలోచిస్తూనే యింటికి చేరాడు.

అతడి వాలకం తాను చూస్తూ ఊరుకోటానికి సరసమ్మకు మనస్కరించనేలేదు. తనకు—మహాప్రభో— ఒక్కరూ కూచ్చుని కుమిలి కుమిలి ఏడవటం ఏమిటో తెలుసు. ఏడ్చి ఏడ్చి దిగమింగాక. లోపల యెంత కసి తయారౌతుందో- అది యెంత విషమో తనకు తెలీంది కాదు. నా అన్నవాళ్ళు వోదార్చితే కాస్త తెమిలి లోకంలో పడవచ్చు. వెళ్ళింది.

'యేమండీ, అల్లా ఉన్నారూ' అంది.

హనుమంతరావు మాట్లాడలేదు.

"నాతో చెప్పరూ"

"..................."

"నేను పరాయిదాన్నిటండీ?"

"............................"

"ఇదుగో, ఇల్లా చూడండి!—"

హనుమంతరావు ఏమీ చెలించలేదు. ఏదో నిప్పుల్లోంచి నడుస్తున్నట్టున్నాడు.

మెడచుట్టూ చేతులువేసి- 'నామాట వినరూ' అంది.

అయినా ఉలకలేదు, పలకలేదు.

"ఇహ నేనేం జేయనమ్మా" అని యింట్లోకి వెళ్ళింది సరసమ్మ. బయటికి వెళ్ళి నలుగురిలోనూ తలెత్తుకు తిరిగే మొగాడికి అనేక కష్టసుఖాలుంటాయి అనుకుంది సరసమ్మ. ఎక్కడికన్నాపోయి అటూ యిటూ తిరిగి, పదిమందితో మాట్లాడివస్తే సగం దిగులు పోతుంది.

ఆదివారం 'ఏమండీ బీచికి పోదాం' అన్నది. హనుమంతరావు ఆలోచించుకుంటూ అలాగే కూచున్నాడు.

'బీచి నాన్నా, బీచి!' అని కిష్టుడన్నాడు.

హనుమంతరావు ఏమీ వినిపించుకోలేదు.

'బీచికని ఏడుస్తున్నాడండీ!' అని మళ్ళీ అంది. దబదబా కుంపటి రాజేసి—అత్తెసరు పడేసి, కుర్రాడికి తలదువ్వింది. తాను దువ్వుకుంది. అన్నం దించి, కాఫీకి నీళ్ళు పడేసింది. షేవింగ్ సెట్, అద్దం నీళ్ళూ తెచ్చి హనుమంతరావుకు ఇచ్చింది. కుర్రాడికి నీళ్ళు పోసింది. తానూ నీళ్ళు పోసుకుంది. దబదబా బట్టలు మార్చుకుంది. పిల్లాడికి ముస్తాబు చేసింది. కాఫీకలిపి తీసుకొచ్చింది.

హనుమంతరావు కిటికీకేసి అలాగే చూస్తున్నాడు. గడ్డం చేసుకోనే లేదు. బలవంతాన గడ్డం చేయించింది. కాఫీ తాగాడు. దబదబా స్నానం చేసి వచ్చాడు. యింటికి తాళం వేసి బీచికి కదిలారు. దారిలోగాని, ట్రాం బండిలోగాని, అతను నవ్వలేదు, తుళ్ళలేదు. పోనీ అని పసరుస లాడ లేదు.

అమావాస్య ఆదివారం సముద్రం మహా ఉరవడిగా వుంది. జనం రెట్టింపు వొచ్చారు. యిసకగూడా మెరుస్తోంది.

శనగపప్పు, జీడిపప్పు దగ్గరనుంచీ జ్యోతిషం, నత్తగుల్లలు, శంఖాలదాకా అమ్ముతారు. కుర్రాడు శనగపప్పు కావాలన్నాడు. కొని పెట్టింది. తాను తెచ్చిన అర్ధణా అయిపోయింది.

నరసమ్మకు పూలు కొనుక్కుందామని ఉంది. పర్సు హనుమంతరావు దగ్గరుంది. ఆయనకేసి ఎంతసేపో చూసింది. అతను యిటుకేసి చూడడు, చూసినా గమనించడు.



మరీ అన్నీ ఉడిగిపోతే తప్ప, పూలమీద ప్రలోభం స్త్రీకి ఎన్నడూ పోదని వాకడు చెప్పేసంగతా?

బీచి దగ్గర సముద్రాన్నీ, ఎగుడు దిగుడుగా ఊగే డింగీలను, వొడ్డున విరుచుకునే అలల్నీ చూస్తోంది ఆమె.

బీచిలో—అంతమందీ కోలాహలంగా వున్నారు. సుఖంగా వుంటానికి దిగుళ్ళు వంటపట్టడమూ కాదు, వయస్సూ కాదు కారణం. వాళ్ళు పైకి అయినా అల్లా వుండగలిగారు. తనకు అదీ చేతకావటం లేదనేది తట్టింది. అతను మెరిసే ఇసుకను, ఆడవాళ్ళ పాదాలనూ, పెదిమలనూ దొంగచూపులుకూడా చూడలేకపోయాడు. నించోబుద్ధీ, కూచోబుద్ధీ పుట్టలేదు. ఇంటికి కదుల్దాం అని లేవదీశాడు.

ఇళ్ళకు మళ్ళారు.

మహాసమ్మర్దం- నరసమ్మ కుర్రాణ్ణి ఎత్తుకుంటానన్నా వినక- తాను నడుస్తానన్నాడు వాడు.

హనుమంతరావు వెనక చూపులేకుండా వూరికే ముందు ముందు తొక్కుకు పోతున్నాడు. తనూ పిల్లాడూ రావాలా.

'ఏమండీ!' అని పిలిచింది. వెనక్కు తిరిగిచూసి ఆగాడు. మళ్ళీ అంతే. ఏదో తప్పించుకు పోదామన్నట్లు నడుస్తున్నాడు. బస్సెక్కి యింటికి చేరారు.

బట్టలు మార్చుకుని వచ్చి 'అన్నానికి లేవరటండీ' అంది. తాను వంటింట్లోకి చక్కాపోయి పీటలు వేసింది. విస్తళ్ళు పరిచింది. నెయ్యి కరగబెట్టింది. అన్నం వడ్డించబోతూ—కాళ్ళు కడుక్కునేందుకు నీళ్ళు యివ్వటానికి సావిట్లోకి వచ్చింది. హనుమంతరావు పడక్కుర్చీలో పడుకున్నాడు.

"కాళ్ళు కడుక్కోరూ?" అంది.

"మీరు తినండి!" అన్నాడు.

"మీరు రాందే ఎల్లాగండీ"

"........................................"

"వాడు నిద్రతో తూలుతున్నాడు, లేవండి!"

"నాకు ఈపూట ఆకలి లేదు."

"ఈమాటకేంగానీ, వడ్డించా లేవండి!"

"నే నీపూట భోంచెయ్యను!"

పాకం ముదురుతోందని నరసమ్మ యింట్లోకి వెళ్ళింది. ఏదో గాలివాన సిద్ధంగా వుంది. ముందు కిష్టుడికి అన్నం పెట్టింది. పక్కవేసి వాణ్ణి పడుకోబెట్టి వచ్చింది.

"అన్నం చల్లారి పోతోంది, రండి!"

".... .... ........"

"అబ్బ, రస్తురూ నాకు ఆకలి తోడుకుపోతోందీ"

".... .... .... ..."

"నాకోసం రండి."

నాకోసం అనే ముక్క ప్రేమ ఉన్నచోట యెంత దివ్యాస్త్రమో కానిచోట అంత విషం.

"ఐతే తినూ, నాతో వొంతెందుకు?"

"అన్నానికి పిలవటం వొంతుటండీ! రండీ!"

"ఊఁహూ. నాకు ఆకలి కావటంలేదు"

"ఏం తిన్నారనీ ఆకలి లేకపోవడానికి? మీకు ఆకలిగానే ఉంది,



లేవండి!"

"నాకు ఆకలి లేదు, నేను తిన్ను"

"నాకు ఆకలిగానే ఉంది. మీరు రాందే నేనెట్టా తిననూ?" అని నరసమ్మ అక్కడే కొంగు పరుచుకుని పడుకుంది. తాను ఇలాగే కోపం వచ్చి అన్నం తినకపోతే— ఆరాత్రి నరసమ్మ తల్లి అన్నం తిన్నేలేదు. ఏమే ఏమే అంటూ అలమటించే దావిడ. ఇప్పుడు ఎవరున్నారనీ సముదాయించడానికీ!

"బీచిలో అల్లా నన్ను రాచుకుంటూ వొస్తావేం?" అన్నాడు హనుమంతరావు.

నరసమ్మ చూస్తూ ఊరుకుంది. ముక్కు పుడకన్నా లేక బోసిపోయిన ఆమె మొహం ఈ మాటతో మరీ డీలా పడిపోయింది.

"నిన్నే...." రెట్టించాడు.

"ఏం వొస్తే-అందరూ రావటంలా?"

"హయ్యోరాత, అందరితో నీకు వంతా?" అన్నాడు. నరసమ్మకు తూర్పూ పడమరా తెలీలేదు. ఇదేదో పెద్ద ముసురే. చూస్తూ ఊరుకుంది.

"వాళ్ళు భార్యాభర్తలు, అలా వొస్తారు!" అన్నాడు.

"బాగానేవుంది కథ" అని గొణుక్కుంది నరసమ్మ. కోపంమీద ఉన్నప్పుడు సర్వేంద్రియాలు బెదిరిన గుర్రాల్లాగా పనిచేస్తై. హనుమంతరావుకు ఈ గొణుగుడు వినపడ్డది.

"మాట్లాడవేం?"

"ఏం మాట్లాడేదండీ, అల్లా అంటుంటేనూ? నేనేం ముష్టిముండనా, పనిమనిషినా? నేనూ భా...."

"అదే కాదంటున్నాను" అన్నాడు.

"సరే, పోనీలెండి" అంది. వీలయినంత పోట్లాటను తప్పించ డానికి ఆమె ప్రయత్నం.

"తెలిసిందా?"

తలెత్తి చూసింది.

"కనక నీవు—"

ఆమె నిశ్చలంగా వింటోంది.

"కనక నీవు—"

లేచి కూచుంది.

"నీ మర్యాదను—నీకేం మర్యాద ఏడిచిందిగాని—నా మర్యాదన్నా కాపాడాలి!"

ఆమె కళ్ళంబడి నీళ్ళు తిరిగినై.

"నీవు అన్నింటాలా చెడిన ముండవు. వాళ్ళెవరో అన్నట్లు ఏదో యింత గూటదీపం పెడతావని చేసుకున్నాను గానీ-నాకు పెళ్ళేమిటి, నీకు పెళ్ళేమిటి? మనం పెళ్ళికి అతీతులం."

ఏడుపునవ్వు నవ్వింది నరసమ్మ. "సరేలెండి" అంది.

మళ్ళీ హనుమంతరావు లేచాడు. "కుక్కిన పేనల్లే పడి వుండక—" అన్నాడు.

"ఎవరైనా వింటారు, నెమ్మదిగా అనండి!" అంది నరసమ్మ. ఈ ఒక్క భయంతోనే హిందూస్త్రీ గజగజ లాడుతుంది. కోపాన ఉన్న భర్తలు ఇక్కడే అధికారం చెలాయించేదిన్నీ.

"ఏం, ఎవరైనా వింటే-యెవరన్నా వింటారనే భయంనాదీ. నీకేం అన్నింటికీ తెగించిన ముండవి!"

"................"



"అన్నం వొడ్డించు"

ఆమె నెమ్మదిగా లేచింది. వడ్డించింది. కచ్చికచ్చేస్తూ అన్నం తిన్నాడు.

'నీవు వడ్డించుకోవేం' అన్నాడు. నాల్గు ముద్దలు నోట్లో పడ్డాక కోపం చల్లారినట్లుంది.

"తింటా లెండి!"

అన్నం సయించక పోయినా, మళ్ళీ దీనికి ఓ పోట్లాట దేనికని ఆమె మూతి తుడుచుకుంది.

ఇంకో రెండు నెలలు గడిచినై.

హనుమంతరావుకు యిల్లంటే తేళ్ళూ జెర్రులూ పాకుతున్నట్లు వుంటుంది.

కాపరం చేస్తున్న భార్య కష్ట సాధించటానికి అన్నట్లు చచ్చి పోయింది.

అన్ని విషయాల్లోనూ యీమె రత్నమల్లేనే వుందిగాని దాన్ని చూస్తుంటే అతనికి ఏమిటోగా వుంటుంది. ఎవరోతిన్న ఎంగిలాకులో భోజనం. తాను వృద్దానికీ యింత కుంగి కుంగి వుంటాడు. ఈమె ఎప్పుడూ కళకళలాడుతూ వుంటుందేం? ఎవరన్నా పాత స్నేహితులు—ఆలోచనని భరించలేక పోయాడు. గుండెల్లో వలుగు పెట్టి పొడిచినట్టుంది.

దాంతోపాటు భగవంతుడు తన్నూ తీసికెళితే బావుండేది. ఈకోర్టూ, ట్రాంబండీ, దస్తావేజులూ, సైపుచెయ్యడం, పార్టీలను బెల్లించడం తప్పేది. ఏమిటో జీవితం అద్దాన్నం ఐపోయింది.

కోర్టునుంచి హనుమంతరావు యింటికొచ్చాడు. తన డ్రాయరు దగ్గరకెళ్ళి కోర్టుకాయితాలూ, మనీపర్సూ తీసి దాచాడు. బట్టలు మార్చుకుని కాళ్ళూ చేతులూ కడుక్కున్నాడు. యిల్లు అద్దంలాగు నీట్‌గా వుంది. నరసమ్మ కాఫీ తెచ్చి యిచ్చింది. తన కళ్ళనే తాను నమ్మలేకపోయాడు. లక్ష్మిలా కళకళ లాడుతూ వుంది. మొహంలో ఏదో బ్రహ్మాండమైన ఆనందం వెలుగుతోంది. ఎవరన్నా పాత ప్రియుడు....నవ్వించాడేమో? హనుమంతరావుకు తేళ్ళూ జెర్రులూ పాకినట్లయింది. కాఫీ తాగాడు.

"బాబేడీ?"

"వంటింటో ఉన్నాడు పిలవనా?"

"వద్దు"

కిష్టుడు వచ్చాడు. "'నాన్నా' పిన్నే ఖద చెపుతోంది నాన్నా."

"కాకీ నక్కా కథలేనా?"

"కాదునాన్నా, సీతామ్మవారే-చచ్చి పోయిందనుకుని జనక మహా రాజు ఏడుస్తున్నాడు నాన్నా."

"యిటువంటి ఏడుపుగొట్టు కథలు వాడికి చెప్పకు." ఆమెకు ఒక్కనిమిషం గుండెలు ఆగినట్లయింది.

తాను ఏంచేసినా తప్పే అవుతోంది. పోనీ—యిది చెయ్యి. నాకు యిలాగ వుండాలి అనడు. తన బుద్ధికి తోచినట్లు చేస్తే—పురుగేరినట్లు మాట్లాడతాడు.

"సరేలెండి" అంది ఆమె.

"ఏం ఈపూట బల్ జోరుగా వున్నావే"

నరసమ్మ నెమ్మదిగా చూసింది.

"ఎవడు వచ్చాడేం?"



ఈ మచ్చ మాపుకోడానికి నరసమ్మ యింకో అమ్మ కడుపున పుట్టాలి కాబోలు.

"ఏం మాటలండీ అవి!" అంది. కడుపులో దేవుతోంది ఆమెకు.

తలకాయ వంచుకుని ఆమె నిలుచుంది. కళ్ళంబడి నీళ్ళు నేలను పడ్డాయి. ఎదురుగుండా వుంటే యింకా ఏమంటాడోనని వంట యింట్లోకి వెళ్ళిపోయింది.

బందిలిదొడ్లో పడ్డ ఆవులాగా ఆమె ఆరాత్రి ఏమీ తినలేదు. సుఖ పెట్టి సుఖపడదామంటే—లోకంలో చోటు తక్కువ.

నరసమ్మ కడుపుతో వుంది.

పొద్దున్నే వికారమూ, డోకులూ, హైరానా. తాను డోకుతుంటే పిన్ని ఏదో అయిపోతుందని కిష్టుడు దిగాలుపడి చూస్తాడు. అంతే ఆమెకు ఓదార్పు. ఆకాశం అంత సంతోషం ఆవిరై ఇగుర్చుకు పోతోంది. నాకు యిది కావాలి, అది కావాలి, అని ఆమె ఎన్నడూ పల్లెత్తి అడగలేదు యింతవరకు. దానిమ్మకాయలు తిందామని ఆమెకు మహాఉంది. హయ్యో రాత. కోరికలు గుర్రాల్నెక్కాలనుకుంటే—ఖర్మ గాడిదల్ని తోల మంటుందిట.

సాయంత్రం తల దువ్వుకుంటుంటే—ఆమెకు ఒక రహస్యం తెలిసింది. తాను తలదువ్వుకోక కంటికాటిక పెట్టుకోక, ప్రవాసిలాగా వుండాలని ఆయన అభిప్రాయమేమో. కళకళలాడుతూ దగ్గరికొచ్చినప్పు డల్లా గొంగళి పురుగును చూసినట్లు చూసి నలిపి చంపుదామనుకుంటాడు. అయినా వోసారి తెంచి పోసుకున్నదానికి—తనకు—అందచందాలేమిటి? ఆ పూట తలదువ్వుకోకుండా—పూలు పెట్టుకోకుండా—మాసిన చీర కట్టు కుంది నరసమ్మ. ఈపని మొదటినుంచీ చేస్తే ఎలా వుండేదో....తరుణం మించిపోయింది. సాయంత్రం హనుమంతరావు వస్తూనే—"యిలా వున్నావేం" అన్నాడు.

ఆమె తొణకలేదు, బెణకలేదు.

వింతగా నవ్వాడు అతను.

"ఏం, ఎవరూ రాలా?" అన్నాడు.

ఆమె తలవొంచుకు నుంచుంది.

"ఇలా దీపపు సెమ్మెలాగ వున్నావు?" అన్నాడు.

"—ఎందుకండీ నన్నిట్లా కోసుకు తింటారూ? నేనేం తప్పు చేస్తున్నానండీ?" అని నరసమ్మ ఆవురుమని ఏడ్చింది.

"పాపం, కుమిలి కుమిలి ఏడుస్తోంది!"

నరసమ్మ యిహ ఆపుకోలేక పోయింది.

"ఎవళ్ళూ రానక్కర్లా. మీరే ఎవరోన్నా వాకర్ని తెచ్చి దిగదేచ్చెట్టుంది. ఎవరైనా నవ్వి పోతారుగానీ—ఊరుకోండి!"

నరసమ్మ చెంప ఛెళ్లుమంది. అయిదువేళ్లూ తేలినై. హనుమంతరావు కోపం ఆగలేదు. తాను ఎంత హాలాహలం మింగుతున్నాడో—చెప్పినా తెలుసుకోదేం? పైగా కోపం ఆగలేదు. జుట్టు పట్టుకుని బిరబిరా వీధిలోకి ఈడ్చుకొచ్చాడు. తిడ్తూ కొట్టాడు. కొడ్తూ తిట్టాడు. కిష్టు దేడుస్తున్నాడు. హనుమంతరావును వాడి ఏడుపుగూడా ఆపలేక పోయింది.

నరసమ్మకు యింతకన్నా చావే మేలనిపించింది.

వీధి వీధంతా పోగై ముక్కుమీద వేలు వేసుకుని చూశారు. ఇంకానయం ఎవ్వరూ ఏమీ అనలేదేమో-ఆమె బతికి పోయిందేమో!

యిల్లు మార్చారు. యిల్లు మారగానే యింటాయన బుద్ధి మారుతుందా? అక్కడా ఇంతే అయింది. నరసమ్మకు మూడోనెల దాటి నాలుగో నెల ప్రవేశించింది.



సెలవులు కాగానే బళ్ళోకెళ్ళిచదువుకో నాన్నా అని కుర్రాడికి బడి పిచ్చ రేపెట్టింది. పలకా బలపం లేకుండానే నెమ్మదిగా ఓనమాలు అఆలు చూసి చదవటం నేర్పింది. హనుమంతరావు ఓరోజున కూచుని కళ్ళనీళ్ళు తుడుచుకుంటున్నాడు. నరసమ్మ చూసింది. దగ్గరకు వెళ్ళింది.

'ఎందుకండీ ఏడుస్తున్నారూ?' అని బుజ్జగించింది.

"నేను రాక్షసుడ్ని" ఏడ్చాడు.

"మరేం కాదు!"అంది.

"నిన్ను నానా హింసా పెడుతున్నాను." ఏడుస్తూ అన్నాడు.

"మీరేం హింసపెట్టలా, ఇంతేనా."

ఎన్ని తిట్టినా తల్లులు పిల్లల్ని ఇలాగే సముదాయిస్తారు.

తాను నవ్వింది. హనుమంతరావును నవ్వించింది. కొంత ఆమె హృదయం తేలికైంది.

కోర్టులకు సెలవలిచ్చారు. హనుమంతరావు ఇంట్లోనే వుంటాడు.

సాయంత్రం అల్లా కాస్సేపు తిరిగి వొస్తాడుగానీ, ఎప్పుడూ ఇంటోనే వుంటాడు.

నరసమ్మా, కిష్టుడూ మామూలుగా నవ్వుతూ తుళ్ళుతూనే వున్నారు. అతనికి ఈ నవ్వులకూ, తుళ్ళలకూ అంతరార్థం ఏమీ తెలీదు. వోరోజు మధ్యాన్నం నిద్రలేచాడు. పిన్నీ, పిల్లవాడూ ఏమిటో కబుర్లు చెప్పుకుంటున్నారు. వోచెవి అటువేశాడు.

"చెప్పవే, చెప్పవే, యామైందీ. అభిమన్నుడు బైటికి వొచ్చాడా, యింకా రానేలేదా, చెప్పవే పిన్నీ! చెప్పవేమే" అంటున్నాడు ఏడుపు గొంతుతో కిష్టుడు. నరసమ్మ నవ్వుతోంది. ఆమె కిలకిలా నవ్వడం తెలీక పసివాడు ఉడ్డు గుడుచుకుంటున్నాడు.

'ఎన్ని చేసినా యిది యింత సంతోషంగా వుంటుందేం' అని హనుమంతరావు అనుకున్నాడు. నెమ్మదిగా లేచి వంటింట్లోకి వెళ్ళాడు. కుంపటి నెమ్మదిగా రాజేశాడు. నరసమ్మ పడమటింటో చప్పుడు విని 'ఉండు నాన్నా' అని లేచింది.

'ఖద చెప్పవే' అని పిల్లాడు పట్టు బడుతున్నా లేచి వంటింట్లోకి వెళ్ళింది. వారు కుంపటిని విసురుకుంటున్నారు.'ఏం కావాలో చెప్పండి నే చేసి యిస్తాగా' అంది.

అతను బెల్లంకొట్టిన రాయిలాగా నోరు మెదపలేదు.

"నేను వచ్చిం దిందుకేగా" అని అంది.

అతను చలించలేదు. కాఫీ పెట్టుకుని తాగి, కాస్త పిల్లవాని కట్టే బెట్టాడు. అన్నం వండాడు. పొయ్యి ఆర్పేసి వంటయింటికి తాళంవేశాడు. సావిట్లోకి వచ్చాడు

'ఇదేం ఖర్మమండీ!' అని నరసమ్మ ఏడుస్తూ వెళ్ళి అడిగింది.

'కాస్సేపు నీమొహం చూపించకు' అన్నాడు. చివాల్న చొక్కా తొడుక్కొని బైటికి వెళ్ళిపోయాడు.

నరసమ్మ ఇల్లంతా అలంగం తిరిగింది.తులిసెమ్మదగ్గర బొమ్మలాగా చాలాసేపు కూచుంది.

'పిన్నీ ఖద చెప్పవుటే'—అని కిష్టుడు అడిగితే కథ చెప్పలేక పోయింది.

దీపాలు పెట్టే అసురసంధ్య. నరసమ్మ దీపం వెలిగించి తనచీరె కూడా అంటించుకుంది.

'దేవుడి పఠాలకు హారతి వెలిగిస్తుంటే—చీర అంటుకుని నరసమ్మ చచ్చిపోయిందట' అనుకున్నారు!

పేరడీ సూరీడు

సాహితీ చంద్రుడు



జలసూత్రం రుక్మిణీనాథ శాస్త్రి